# సినిమా కెళ్లి చూడు....

ఆరోజు ఆదివారం.

సాయంత్రం అయిదు గంటలైంది.

జానకిరాం, సత్యవతి సర్దాగా సినిమాకి వెళ్దామని అనుకున్నారు ఆ రోజు.

ఇద్దరూ ఇల్లుతాళం వేసి బస్సుస్టాపుదాకా నడిచి వెళ్లారు.

"ఏవండీ....అసలే ఆదివారం....మనం బస్సుకోసం కాచుకు ఉంటే హైమైపోతుంది. టిక్కెట్లు దొరకవు....ఆటోలో పోదామండీ...." అంది సత్యవతి.

జానకిరాం వెంటనే ఆ వైపుగా పోతున్న ఆటోని ఆపాడు.

"ప్రభాత్ థియేటర్‌కి వస్తావా?...." ఆటోవాడిని అడిగాడు జానకిరాం....

"హా్రె.... ఎందుకురాం సాబ్....ఆటో ఎక్కండి....' అన్నాడు ఆటోవాడు.

వాళ్ళిద్దరూ చాలా సంబరపడిపోయారు.

అడగ్గానే వస్తానని అన్న ఆటోవాడిని వీడొక్కడ్నే చూశార వాళ్ళు ఇప్పటిదాకా.

ఇద్దరూ ఆటో ఎక్కి కూర్చున్నారు. ఆటోస్టార్ట్ అయి ముందుక కదిలింది.

"కాస్త త్వరగా పోనివ్ ఆటో అబ్బీ....లేకపోతే టిక్కెట్లు దొ కవు...." అంది సత్యవతి కంగారుపడ్తూ. అంతే ...ఆ మాటవింటూ ఆటోవాడు ఆటోని ఆపేశాడు.

"నే రాను....మీరు దిగండి...."

"ఇప్పుడే కదా వస్తానని మాతో అన్నావ్....మళ్ళీరానని అంటా వేం?...." ఆశ్చర్యంగా అడిగాడు జానకిరాం.

"మరి మీకు జల్దిల ఉన్నది కదా....అందుకే నే రాను...."

"పోనీ మెల్లగా పోనియ్యవయ్యా...."

"మెల్లమెల్లగా పోనిస్తే మీకు టిక్కెట్లు దొర్కవ్‌గదా?" అన్నాడు ఆటోవాడు విలాసంగా.

"త్వరగా వెళ్ళమంటే రానన్నావు. పోనీ మెల్లగా వెళ్ళమంటే టిక్కెట్లు దొరకవని నువ్వే చెప్తున్నావ్....ఇంతకీ నీ ఉద్దేశం ఏంటయ్యా?...." కాస్త విసుక్కున్నాడు జానకిరాం.

"అద్గో....గట్ల మాట్లాడ్తే అస్సలురాను...." అన్నాడు ఆటోవాడు కోపంగా.

"అబ్బ మీరుండండి....అలానేనా వాడితో మాట్లాడేది? ....అసలే ఆలస్యం అవుతుంది....టిక్కెట్లు దొరకవ్...."అంది సత్యవతి.

"నేనేం చేశానే మధ్యలో....వాడే రానని అన్నాడు కదా?...."

"నేనొస్తాగానీ మీరు జల్దిల ఉన్నారు కాబట్టి రాను....మీటర్ మీద మూడ్రూపాయలు ఎక్స్ట్రా ఇస్తే వస్తాను...."

"ఇస్తాం లేవయ్యా....నువ్వుపద....అసలే ఆలస్యం అయ్యిందా.. టిక్కెట్లు దొరకవు...." కంగారుగా అంది సత్యవతి.

"గది శానా మంచి సిన్మానా అమ్మ?"

"అవును త్వరగా పద ఆలస్యం అయ్యింది...."

"గది జూడకపోతే మన్సు కష్టం అవుతాదామ్మ?"

"అవునయ్య....చాలబాధ కల్గుతుంది....త్వరగా పద టిక్కెట్లు దొరకవు...."


"గట్లయితే నాల్గురూపాయల్ ఎక్స్ట్రా ఇవ్వండి లేకపోతే రాన్...."

జానకిరాం ఆటో కమ్మీకేసి తలకొట్టుకున్నాడు.

"ఆయనట్లానే తలకొట్టుకుంటాడుగానీ నువ్వు పదబ్బి.... నీకు నాల్రూపాయలూ నేనిస్తా.... అసలే టైమైపోతూంది...." అంది సత్యవతి.

అంతే.... అమాట వినబడగానే ఆటో రివ్వున ముందుకు కదిలింది.

వాళ్ళు పావుగంటలో సినిమా హాలు చేరుకున్నారు. ఆటోవాడికి డబ్బులిచ్చి పంపేసి థియేటర్ కాంపౌండ్లోకి అడుగుపెట్టారు.




ఆదివారం.... అందులోనూ కొత్త సినిమావల్ల అక్కడ చాలపెద్ద పెద్ద క్యూలు ఉన్నాయ్....

"చూశారా!.... ఆటోవాడితో బేరాలాడ్తూ కూర్చున్నారు.... ఇక్కడ చూడండి క్యూ ఎంత పెరిగిపోయిందో?...." అంది సత్యవతి గుండెలు బాదుకుంటూ.

"బాదుకున్నది చాల్లే.... నువ్వెళ్ళి ఆడోళ్ళ క్యూలో నిలబడు....

నేనెళ్ళి మగాళ్ళ క్యూలో నిలబడ్తాను....టిక్కెట్లు ఎవరికి దొరికితే వాళ్ళు తీసుకుందాం...." అన్నాడు జానకిరాం.

ఇద్దరూ విడివిడిగా క్యూలలో నిలబడ్డారు.

పావుగంట అలా ఎండలో నిలబడి చెమటలు కక్కుతున్న తరువాత బుకింగ్ కౌంటర్ ఓపెన్‌చేశారు. అంతదాకా బుద్ధిగా క్యూలో నిలబడి ఉన్నవారు టిక్కెట్లు ఇవ్వడం మొదలుపెట్టగానే తోసుకోడం మొదలుబెట్టారు.

చె తోపులాటకి జానకిరాం అటూఇటూ ఊగిసలాడాడు. ఎవరో అతని జుట్టు పీకేశారు....ఇంకెవరో అతని చొక్కాపట్టుకుని లాగారు.... అతని చొక్కా జేబు చిరిగిపోయి వేలాడసాగింది. మరో నిముషం తోపులాట తరువాత ఎవరో జానకిరాం వీపుమీద చెయ్యిపెట్టి ఒక్కతోపు తోశారు. జానకిరాం క్యూలోంచి నాలుగ్గజాలు అవతలకి వెళ్ళి నేలమీద మట్టిలో బోర్లాపడ్డాడు. బట్టలంతా దుమ్ము అయ్యింది.

"అర్రే!...." అని అనుకుంటూ జానకిరాం బట్టలకయిన దుమ్ముని దులుపుకుని మళ్ళీ క్యూ దగ్గరికి వెళ్ళాడు.

"క్యూలో దూరుతున్నాడు.... లాగెయ్యండి....లాగెయ్యండి...." క్యూలో వెనక ఉన్నవాళ్ళు అరిచారు.

వాళ్ళ అరుపులకి ఒక కానిస్టేబులు అక్కడికి లాఠీ ఊగిస్తూ పరుగెత్తుకుని వచ్చాడు.

"ఏయ్....క్యారే....క్యూమే గుస్ జాతే హై?" అంటూ జానకిరాం చొక్కా కాలర్ పట్టుకుని వెనక్కిలాగాడు. అంతే....జానకిరాం వెనక్కి తూలి ఈసారి వెల్లకిలాపడ్డాడు.

జానకిరాం లేచి నిలబడి మళ్ళీ దుమ్ము దులుపుకున్నాడు.

"అర్రె ఏంటయ్యా అలా తోసేస్తావ్....నేను ఇందాకట్నుండీ క్యూలో నిల్చున్నాను...." అన్నాడు జానకిరాం మళ్ళీ క్యూలో దూరడానికి ప్రయత్నిస్తూ.

జనం గోలపెట్టారు....

"హు[రే ఇస్కీ....చెప్తూంటే నీక్కాదు....ఛల్...." లాఠీతో మోకాళ్ళకింద ఎముకలద మీఒక్క దెబ్బవేశాడు కానిస్టేబుల్.

"హమ్మనాయనోయ్....చచ్చా[నా దేవుడోయ్..." గావుకేకపెట్టి క్యూకి దూరంగా జరిగి కింద కూర్చుని చేత్తో దెబ్బ తగిలినచోట రుద్దుకో సాగాడు జానకిరాం.

క్యూలో అందరూ ఘొల్లుమని నవ్వారు.

కాస్సేపైన తరువాత లేచి కుంటుకుంటూ వెళ్ళి ఓ పక్కన నిల బడి ఆడోళ్ళ క్యూవంక చూశాడు జానకిరాం.

అక్కడ మగాళ్ళ క్యూకంటే అన్యాయంగా ఉంది. టిక్కెట్లుసంపా దించడం కోసం హోరా హోరి యుద్ధం జరుగుతున్నట్లు ఉంది. క్యూ ఏ మా[తం లేదు — కొప్పులుఊడిపోతున్నాయ్....గాజులు పగిలిపోతున్నాయ్ సత్యవతి ఆ గుంపుని చేదించుకుంటూ టిక్కెట్లు ఇచ్చే కౌంటర్వైపు వెళ్ళడం జానకిరాం చూశాడు.

ఒక అయిదు నిముషాలు గడిచాయ్.

ఇంతలో ఆడోళ్ళ గుంపులోంచి సత్యవతి రివ్వున పరిగెత్తుకు వచ్చింది. ఆమె చీరమొత్తం చెదిరిపోయింది. జాకెట్ చిరిగిపోయింది. తలంతా రేగిపోయి ఉంది. మొహంమీద గోళ్ళతో రక్కిన గాట్లుఉన్నాయి అయినా ఆమె మొహంలో ఆనందం!....

"ఏమండీ....మనకి టిక్కెట్లు దొరికాయండి...." అంది సంబ రంగా.

"ఆ....దొరికాయా?....ఏవీ.... ఏవేవీ.... అవేవీ...." అన్నాడు కుంటు కుంటూ ఆమెకి ఎదురుగా వెళ్తూ జానకిరాం.

సత్యవతి చెయ్యిచాపి చూపించింది.

"ఏవీ?...." అన్నాడు జానకిరాం ఆశ్చర్యంగా.

"ఇదిగో...." అంటూ తన చేతివంక చూస్కున్న సత్యవతి కెవ్వుమని గట్టిగా అరిచింది.

"ఎవరు.... ఏంటి?.... ఏమైంది?.... ఎందుకా కేకలు?...." అంటూ కంగారుగా ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్ళు అక్కడికి పరుగెత్తుకు వచ్చారు. వాళ్ళు సత్యవతిని చూశారు.

"హా — ఈమె రేప్ చెయ్యబడింది.... రేప్ కేసు — ఏమ్మా.... సినిమా హాలు వెనకాల చేశారా? మెట్లకిందికిలాక్కెళ్ళి చేశారా?.... మామూలు రేపా, సామూహిక రేపా?.... సామూహిక రేపైతే ఎంతమంది "చేశారు?" అంటూ ఇద్దరు కానిస్టేబుళ్ళు సత్యవతిమీద ప్రశ్నలవర్షం కురిపించారు.

"రేపేంటయ్యా.... ఇంతోటి అందానికి నన్నెవరు చేస్తారు?...." అంది సత్యవతి ఆశ్చర్యంగా.

"మిమ్మల్నెవరూ రేప్ చెయ్యలేదా?.... మరి ఆ గాట్లేంటి, ఆ జుట్టు రేగిపోడమేంటి, ఆ జాకెట్ చిరగడమేంటి; ఆ చీర చెదిరిపోడం ఏంటి?" అన్నారు ఇద్దరూ.

సత్యవతి విసుక్కుంది.

"కొత్త సినిమా రిలీజైనప్పుడు మీరు హాలుదగ్గర డ్యూటీచెయ్యడం ఇదే మొదలా? — నేనింకా నయ్యం.... అటు చూడండి...." అని ఓ దిక్కుకి చూపించింది సత్యవతి.

ఒకామె చేతిలో టిక్కెట్లతో ఒంటిమీద కేవలం లంగా బాడితో ఎన్ట్రెన్స్‌వైపు పరుగులు తీసింది. అతడి వెనకాల చిరిగిన షర్టుతో డ్రాయర్‌తో ఆవిడ భర్త పరుగెత్తుతున్నాడు.

"ఓలమ్మో!!...." గుండెలమీద చెయ్యేసుకున్నారు కానిస్టేబుల్సు.

మళ్ళీ టిక్కెట్ల సంగతి గుర్తుకొచ్చి మరోసారి కెవ్వుమంది సత్యవతి.

"జనంలోంచి తోసుకుని వచ్చేటప్పటికి టిక్కెట్లు ఎక్కడో జారి పడిపోయినట్టున్నాయండీ...." అంది దీనంగా సత్యవతి.

ఇంతలో బుకింగ్ క్లోజ్ చేసేశారు.

కొందరు కుర్రాళ్ళు టిక్కెట్లు ఓపెన్‌గా బ్లాకులో అమ్మసాగారు.

"హవ్వ.... ఇంటికి తిరిగెళ్ళిపోతే అందరూ నవ్వరూ?.... ఎంత సిగ్గుచేటు.... టిక్కెట్లు బ్లాకులో కొనండి...." అంది సత్యవతి భర్తతో.

"అవునవును....ఎంత సిగ్గుచేటు!...." అన్నాడు జానకిరాం.

వాళ్ళు అయిదు రూపాయల టిక్కెట్లు పదిరూపాయల చొప్పున బ్లాకులో కొనుక్కుని వెళ్ళారు. తీరాచూస్తే ఇద్దరి సీటు నెంబరూ చెరో మూల ఉన్నాయి. ఒక దగ్గర లేవు. జానకిరాం రెండు సీట్లు ఒక దగ్గరగా ఉండడం కోసం వాళ్ళనీ వీళ్ళనీ బతిమిలాడాడు అక్కడ కూర్చోండి ఇక్కడ కూర్చోండి అని. అప్పటికే సినిమా మొదలవడంవల్ల అతడు అందరి దగ్గరికీ వెళ్ళి నిలుచుని మాట్లాడుతుండడంతో అడ్డురావడంవల్ల వెనక జనం "ఒరేయ్....కూర్చోబే....నిన్నే....ఏయ్... నీ....ఇస్కీ..." అంటూ బండబూతులు తిట్టసాగారు. చివరికి రెండు సీట్లూ ఒక దగ్గర సంపాదించాడు జానకిరాం. సినిమా చూస్తుండగా వెనకలైను వాడు మెల్లగా కాల్తో సత్యవతిని నొక్కాడు. సత్యవతి జానకిరాం చెవిలో చెప్పింది. జానకిరాం వెనకసీటువాడూ కాస్సేపు జుట్టూ జుట్టూ పట్టుకున్నారు. ఇంతలో పోలీసులు వచ్చి వెనక సీటువాడిని లాక్కెళ్ళిపోయారు. మొత్తానికి కొత్త సినిమాని మొదటి వారంలోనే చూసి ఇంటికి చేరారు ఆ జంట.

ఆ మర్నాడు ఆఫీసులో జానకిరాం పక్కసీటులోని అప్పారావు అడిగాడు.

"నిన్న ఆదివారం ఏం చేశావోయ్ ?"

"సర్దాగా నేను ఆవిడా సినిమాకెళ్ళాం" జవాబు చెప్పాడు జానకిరాం

❋